క్లుప్తంగా

తక్కువ ధరకు నాణ్యమైన సరకులు



తెనాలి: ప్రభుత్వ ఆదేశాల ప్రకారం వినియోగదారుల సౌలభ్యం కోసం నాణ్యమైన స్టీమ్ బియ్యం, బియ్యం, కందిపప్పును డివిజనులోని వివిధ ప్రాంతాల్లో ప్రత్యేక కౌంటర్లలో తక్కువ ధరకు విక్రయిస్తున్నట్టు తెనాలి సబ్‌కలెక్టర్ ప్రఖర్‌జైన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెనాలి పట్టణంలోని గాంధీపార్కు, గంగానమ్మపేట, మంగళగిరిలో వ్యవసాయ మార్కెట్‌యార్డు పక్కన, పొన్నూరులోని రైతుబజార్లలో ఈ కౌంటర్లను ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు. ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

లయన్స్ గవర్నర్ సలహాదారుగా కాకరపర్తి



తెనాలి: లయన్స్ క్లబ్ ఆఫ్ తెనాలి స్నేహ వ్యవస్థాపకుడు, తెనాలికి చెందిన కాకరపర్తి సుబ్రహ్మణ్యం లయన్స్ డిస్ట్రిక్ట్ 316 జిల్లా 2024–25 సంవత్సరానికి డిస్ట్రిక్ట్ గవర్నర్ సలహాదారుగా నియమితులయ్యారు. ఈ మేరకు లయన్స్ డిస్ట్రిక్ట్ గవర్నర్ పరుచూరి గోపీచంద్ నుంచి నియామక పత్రం పొందినట్లు సుబ్రహ్మణ్యం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. లయన్స్ క్లబ్ వ్యవస్థలో కాకరపర్తి సుబ్రహ్మణ్యం జిల్లా స్థాయిలో వివిధ పదవులను నిర్వహించారు. పేదలు, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కోసం పలు సేవా కార్యక్రమాలను చేపట్టారు. పదవి రావడానికి తోడ్పడిన వారికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

నిరుపయోగ కాలువను పూడ్చివేయాలి



తెనాలి: స్థానిక 14వ వార్డులోని చినరావూరు తోటలో పట్టణానికి, పంచాయతీకి మధ్యలో ఉన్న మురుగు కాలువలో చెత్త పేరుకుపోయి స్థానికులు చాలా ఇబ్బంది పడుతున్నారని జాతీయ మానవ హక్కుల మండలి జాతీయ కార్యదర్శి పల్నాటి నాగరాజు అన్నారు. స్థానికుల అభ్యర్థన మేరకు 200 అడుగుల ఈ పంట కాలువను ఆయన మంగళవారం పరిశీలించారు. స్థానికులకు, రైతులకు ఈ కాలువతో ఎలాంటి ఉపయోగం లేదన్నారు. దీనిని మున్సిపల్ అధికారులు పూర్తిగా పూడ్చివేయాలని కోరారు.

వసతి గృహాల్లో దోమల నివారణకు ఫాగింగ్



తాడికొండ: వసతి గృహాలు, నివాసిత ప్రాంతాల్లో దోమల నివారణకు పంచాయతీ అధికారులు మంగళవారం ఫాగింగ్ చేపట్టారు. జిల్లా కలెక్టర్ పర్యటనలో భాగంగా బీసీ బాలికల వసతి గృహం, జెండా చెట్టు బజారులో పారిశుద్ధ్యాన్ని పరిశీలించి, ఫాగింగ్‌కు ఆదేశించినట్లు పంచాయతీ కార్యదర్శి పి.శ్రీనివాసులు రెడ్డి తెలిపారు.

పీఎఫ్ రుణాలు మంజూరు చేయాలి



గుంటూరు ఎడ్యుకేషన్: మున్సిపల్ ఉపాధ్యాయులకు పీఎఫ్ రుణాలు మంజూరు చేయాలని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ రాజ్యలక్ష్మికి యూటీఎఫ్ నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.చిన్నయ్య, కె.ప్రభూజీ విజ్ఞప్తి చేశారు. మంగళవారం నగర పాలక సంస్థ కార్యాలయంలో అదనపు కమిషనర్‌ను కలసిన యూటీఎఫ్ నాయకులు ఆమెకు వినతి పత్రం సమర్పించారు. కుటుంబ అవసరాలు, అనారోగ్య సమస్యలతో పాటు పిల్లల చదువులు తదితర భవిష్యత్తు అవసరాల కోసం దాచుకున్న పీఎఫ్ సొమ్ముపై రుణాలు మంజూరు కాకపోవడంతో ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. జీవో 84 ద్వారా మున్సిపల్ ఉపాధ్యాయుల సర్వీసు రూల్స్, పరిపాలనా బాధ్యతలను డీఈవో, ఎంఈవోలకు బదిలీ చేయడం వల్ల ఉపాధ్యాయులు గత రెండేళ్లుగా పీఎఫ్ ఖాతాల నుంచి రుణాలు పొందలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని అదనపు కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఏసీ మాట్లాడుతూ.. పీఎఫ్ ఖాతాల నుంచి పార్ట్ ఫైనల్ రూపంలో రుణాలు మంజూరు చేస్తామని, అవసరమైన వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.కళాధర్, నాయకులు బాజీబాబా, వెంకటేశ్వర్లు, బి.ప్రసాద్, ఎ.ప్రసాద్ ఉన్నారు.

సరైన పోషణ.. పశుసంపదకు రక్షణ

- మూగజీవాల మేత విషయంలో జాగ్రత్తలు అవసరం
- అన్నదాతలకు అవగాహన కల్పిస్తున్న పశు వైద్యులు



మేత మేస్తున్న పశువులు

కొల్లిపర: వ్యవసాయంతోపాటు పశుపోషణ గ్రామాలలో ప్రధాన వృత్తిగా పూర్వ కాలం నుంచి ఉంది. పాడి రైతులు తమ పశువులను సొంత బిడ్డల్లా చూసుకుంటూ ఉంటారు. ప్రస్తుతం సీజన్ మారి నెమ్మదిగా వర్షాలు పడుతున్నాయి. ఈ నేపథ్యంలో పశువులు జబ్బుల బారిన పడకుండా ఉండాలంటే అనేక జాగ్రత్తలు తీసుకోవాలి. ముఖ్యంగా వాటికి పోషకాహారం పూర్తి స్థాయిలో అందజేయాలి. అప్పుడు మాత్రమే పశుసంపద వృద్ధి చెందుతుంది. పశువులకు తగిన మోతాదులో మాంసకృత్తులు, పిండి, కొవ్వు పదార్థాలు, విటమిన్లు, నీరు అవసరమని పశువైద్యులు సూచిస్తున్నారు.

రోగనిరోధక శక్తి కోసం ఇలా......

పశువుల పెరుగుదలకు, రోగనిరోధక శక్తి మెరుగుకు మాంసకృత్తులు ఎంతో అవసరం. పడ్డలు, పెయ్యల ఎదుగుదలకు, పాడి పశువుల్లో పాల దిగుబడికి ఇవి దోహదపడతాయి. ఇవి ఆహారంలో లోపిస్తే పశువులు చిక్కిపోవడం, పెరుగుదల స్తంభించడం, అడాశయం చిన్నగా మారడం, ఆలస్యంగా యుక్త వయసుకు రావడం, వ్యాధి నిరోధక శక్తి తగ్గడం, కండరాల బలహీనత వంటి సమస్యలు ఉత్పన్నమవుతాయి. పత్తి గింజలు, కొబ్బరి పిండి, వేరుశనగ పిండి, నువ్వుల పిండి, చేపల పొడి వంటివి పప్పు జాతికి చెందిన పశుగ్రాసాల్లో ఇవి సమృద్ధిగా లభిస్తాయి.

దెబ్బల నుంచి రక్షణ .....

పశువుల శరీరంలో కొవ్వు నిల్వలు అంతర్గత అవయవాలను దెబ్బల నుంచి కాపాడతాయి. శరీర ఉష్ణోగ్రతను క్రమబద్ధీకరిస్తాయి. ఆహారంలో రుచిని పెంపొందిస్తాయి. పశువుల సక్రమ పునరుత్పత్తిలో మాంసకృత్తుల కంటే కొవ్వు అందించే శక్తి ముఖ్యమైంది. పిండి పదార్థాల కన్నా కొవ్వు రెండున్నర రెట్లు అధిక శక్తి ఇస్తుంది. గ్రాము కొవ్వు పదార్థం సుమారు 9 కిలోల క్యాలరీల ఉష్ణశక్తిని అందిస్తుంది. వేరుశనగ పిండి, కొబ్బరి పిండి, నూనె గింజల చెక్క, గోధుమ తవుడు, వరి తవుడులో కొవ్వు పదార్థాలు ఎక్కువగా ఉంటాయి.

నీరు అత్యంత అవసరం...

పశువులు నీరు లేకుండా ఐదు రోజులకు మించి బతకలేవు. నీరు శరీర జీవన ప్రక్రియకు, ఉత్పాదకతకు ఎంతగానో ఉపయోగపడుతుంది. ఆహారంలోని వివిధ పోషక పదార్థాలను సంగ్రహించడానికి, పోషక పదార్థాలు, విటమిన్లు, ఖనిజ లవణాలను శరీరంలోని వివిధ భాగాలకు చేర్చడానికి, శరీర ఉష్ణోగ్రతను క్రమబద్ధీకరించడానికి, శ్వాస ప్రక్రియ కొనసాగడానికి, శరీర ద్రవాల పీచు సాధారణ స్థాయిలో ఉండేందుకు, చర్మం సాగే గుణం కలిగి ఉండడానికి, జీర్ణక్రియలో ఉపయోగపడే కొన్ని ఎంజైముల తయారీకి, వ్యర్థపదార్థాల విసర్జన క్రియకు నీరు దోహదపడుతుంది. శరీరంలోని మాంసకృత్తులు, కొవ్వు పదార్థాలు, పిండి పదార్థాల ఆక్సిడేషన్ వల్ల కూడా అర లీటరు నుంచి లీటరు వరకు నీరు ప్రతి పోషణ పదార్థం తరఫున లభ్యమవుతుంది. శరీరంలో నీరు తక్కువైతే చర్మం పొడిగా మారడం, మూత్ర సంబంధ వ్యాధులు, అజీర్తి, మలబద్ధకం తదితర సమస్యలు ఉత్పన్నమవుతాయి. మలిన పదార్థాలు విసర్జింపబడకుండా పశువుల డీహైడ్రేషన్ గురవుతాయి. పశువుకు రోజుకు 50 నుంచి 60 లీటర్ల నీరు అవసరం.

వానాకాలంలో జాగ్రత్తగా ఉండాలి



వర్షాకాలంలో పశువులు, గొర్రెలు, మేకల పెంపకందారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి. లేకపోతే చిటిక, నీలి నాలుక, పారుడు, కాళ్ల డెక్కల, శ్వాసకోశ వ్యాధులు సోకే ప్రమాదం ఉంది. గొర్రెలు, మేకలను వర్షం బారి నుంచి రక్షించడం కోసం పాకలు ఏర్పాటు చేయాలి. అప్పుడే వాటికి న్యూమోనియా వ్యాధి సోకకుండా కాపాడుకోవచ్చు. వ్యాధి సోకిన వాటికి సులువుగా జీర్ణమయ్యే ఆహారం ఇవ్వాలి. వ్యాధులు సోకిన గొర్రెలు, మేకలను మందలో కలపకూడదు. ఒక వేళ గొర్రె, మేక మృతి చెందితే దానిని ఊరికి దూరంగా తీసుకెళ్లి లోతుగా గొయ్యి తవ్వి పూడ్చి పెట్టాలి. మూగ జీవాలకు ఏ వ్యాధి సోకినా వెంటనే దగ్గరలోని పశువైద్యశాలకు తీసుకెళ్లి చికిత్స చేయించాలి. అక్కడి పశువైద్యాధికారి సలహాలు, సూచనలు పాటించాలి.

– డాక్టర్ సాయి సతీష్‌రాజు, కొల్లిపర మండల పశువైద్యాధికారి

పేదలకు బియ్యం పంపిణీ



తెనాలి అర్బన్: యడ్లలింగయ్య కాలనీ, పూలే కాలనీలోని పేద యానాదులకు మంగళవారం బియ్యం, పూరిళ్లపై వేసుకునే పరదాలను పంపిణీ చేశారు. ట్రైబల్స్ చారిటబుల్ ట్రస్ట్ డైరెక్టర్ రావూరి అంజలీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాలు పడుతున్న నేపథ్యంలో అవసరమైన పట్టాలను 20 మందికి పంపిణీ చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో వలంటీర్లు ఇంటూరి బెనహర్, బందెల రమేష్, పుల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలి

తెనాలి రూరల్: చేబ్రోలు మండలం కొత్తరెడ్డిపాలెంలో దళిత బాలికపై లైంగిక దాడికి పాల్పడి హత్య చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న గ్యాస్ డెలివరీ బాయ్ నాగరాజుపై కఠిన చర్యలు తీసుకోవాలని జై భీమ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కలెవరపు దేవానంద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. మైనర్‌పై ఇలాంటి దారుణానికి పాల్పడిన అతడిని ఎట్టిపరిస్థితుల్లోనూ వదలకూడదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టి కేసు దర్యాప్తు వేగవంతం చేయాలని కోరారు.

పరిసరాల పరిశుభ్రత ముఖ్యం



దోమల నివారణ మందు పిచికారీ చేస్తున్న సిబ్బంది

తెనాలి అర్బన్: దోమలు కుడితే పెద్ద రోగాలు వస్తాయని, పరిసరాల పరిశుభ్రత పాటిస్తే వీటిని అరికట్టవచ్చని మలేరియా విభాగ తెనాలి పట్టణ సబ్ యూనిట్ అధికారి శ్రీకంఠ ఉమాకాంత్ పేర్కొన్నారు. పట్టణంలోని చినరావూరుతోటలో మంగళవారం మలేరియా విభాగం ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. దోమల నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలతో కరపత్రాలను పంపిణీ చేశారు. ఇంటి ఆవరణలో నీటిని బయటకు పంపేలా చర్యలు తీసుకున్నారు. దోమల నివారణ మందు పిచికారీ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మురుగు కాల్వల్లో నీరు సక్రమంగా పారేలా చూడాలన్నారు. వ్యాధులపై ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి అంది బాలచంద్రమౌళి, సూపర్‌వైజర్ దీపాల శ్రీనివాసరావు, హెల్త్ అసిస్టెంట్ షేక్ రషీద్, శానిటరీ సెక్రటరీ చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

మంత్రి నారాయణతో నగర కమిషనర్ భేటీ



సమావేశంలో మంత్రి నారాయణకు సమస్యలు వివరిస్తున్న కమిషనర్

నెహ్రూ నగర్: విజయవాడలోని సీఆర్డీఏ కార్యాలయంలో గుంటూరు నగరపాలక సంస్థలో జరుగుతున్న అభివృద్ధి పనులు, సమస్యలపై కమిషనర్ కీర్తి చేకూరి, గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మహ్మద్ నసీర్, ఇతర అధికారులతో మున్సిపల్ శాఖ మంత్రి పి.నారాయణ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. నగరంలో పారిశుద్ధ్యం, శివారు ప్రాంతాల్లో తాగు నీటి సరఫరాలో ఎదురవుతున్న ఇబ్బందులు, రోడ్ల సమస్యలపై చర్చించారు. మొండి గేటు డ్రైయిన్ రైల్వే ట్రాక్ క్రాసింగ్, అగత్త వరప్పాడు డ్రైన్‌లు పొంగడం, కల్వర్టుల కింద పూడిక తీత అంశాలకు శాస్వత పరిష్కారం చూపాలని కోరారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో ఈ–ఆటోల ద్వారా చెత్త సేకరణ సమస్యలు పరిష్కరించాలని కమిషనర్‌ని మంత్రి ఆదేశించారు. రెండు రోజుల్లో కార్పొరేషన్ అధికారులు, ప్రజా ప్రతినిధులతో సంయుక్త సమావేశం ఏర్పాటు చేయాలని కమిషనర్‌కు సూచించారు. నగరంలో ఉన్న ఆర్ అండ్ బీ రోడ్ల మరమ్మతులకు కూడా ప్రజా సౌకర్యార్థం కార్పొరేషన్ అధికారులు మరమ్మతులు చేయాలన్నారు. నగరంలో మెరుగైన పారిశుద్ధ్య నిర్వహణకు త్వరలో పారిశుద్ధ్య పక్షోత్సవాలు నిర్వహించనున్నట్లు మంత్రికి కమిషనర్ వివరించారు. అదేవిధంగా నగరంలో డ్రెయిన్లలో పూడికతీత పనులపై వివరాలు అడిగి వర్షాకాలం డ్రైన్‌లు పొంగే అవకాశం ఉన్నందున పూడిక తీతపై ప్రత్యేక దృష్టి సారించాలని కమిషనర్‌ను ఆదేశించారు.

జన నాయక్ కర్పూరి ఠాకూర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి



నెహ్రూనగర్: గుంటూరు నగరంలో ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధుడు, భారత రత్న "జన నాయక్ కర్పూరి ఠాకూర్" విగ్రహ ఏర్పాటుకు అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామని నగర మేయర్ కావటి శివనాగ మనోహర్ నాయుడు అన్నారు. మంగళవారం జన నాయక్ కర్పూరీ ఠాకూర్ ఫౌండేషన్ సభ్యులు మేయర్‌ను సంపత్ నగర్‌లోని ఆయన క్యాంపు కార్యాలయంలో కలసి కర్పూరీ ఠాకూర్ విగ్రహాన్ని గుంటూరు నగరంలో ఏర్పాటు చేసేందుకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ కర్పూరి ఠాకూర్ క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని 26 నెలలు జైలు జీవితం గడిపారన్నారు. బిహార్ ముఖ్యమంత్రిగా పని చేశారని తెలిపారు. ఇన్నర్ రింగ్ రోడ్డులో ట్రాఫిక్ సమస్య లేని ప్రాంతంలో ఏర్పాటు చేసేందుకు సహకరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ కో–ఆర్డినేటర్ పీవీ రమణయ్య, ట్రెజరర్ కె.దేవి ప్రసాదరావు, ఈసీ మెంబెర్ బాల తాత పాల్గొన్నారు.

వంతెనల నాణ్యతపై దర్యాప్తు జరిపించాలి



లక్ష్మీపురం: ఒక వంతెన కూలితేనే ఎంతో ఆశ్చర్యం కలుగుతుందని అటువంటిది బిహార్‌లో ఇప్పటికి పద మూడు వంతెనలు కూలిపోవడం ఆశ్చర్యం కలిగిస్తోందని, దీనిపై అవగాహన సంస్థ దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తోందని సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి అన్నారు. స్థానిక అరండల్ పేటలోని సంస్థ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రెండు వారాల్లో పది వంతెనలు ఒకదాని తరువాత ఒకటి కూలిపోయాయని, ఇంజనీర్ల పర్యవేక్షణ లోపం, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతోనే వారధులు కూలుతున్నాయన్నది స్పష్టం తెలుస్తోందన్నారు. బ్రిడ్జిలు కూలిపోవడంపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని కోరారు. అలాగే విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేట్ పరం కాకుండా ఉండాలంటే ప్రధాని మోదీ విస్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని శివరామిరెడ్డి విజ్ఞప్తి చేశారు. స్టీల్ ప్లాంటు ప్రైవేటీకరణ ప్రశ్నే లేదని విశాఖపట్నం పర్యటనకు వచ్చిన కేంద్ర ఉక్కు శాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామి మీడియా సమావేశంలో పేర్కొనడం సంతోషకరమన్నారు. కేంద్రంపై ఒత్తిడి తెచ్చి ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణను ఉప సంహరింప జేయటం తెలుగుదేశం పార్టీ ధర్మమని తెలిపారు.

ఓపీఎస్ వెంటనే అమలు చేయాలి

ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు చాంద్ బాషా

గుంటూరు వెస్ట్: సీపీఎస్ స్థానంలో ఓపీఎస్ (పాత పెన్షన్ విధానం) విధానం కావాలని ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు చాంద్ బాషా డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ఉద్యోగ సంఘ కార్యాలయంలో నిర్వహించిన ప్రభుత్వ ఉద్యోగ సంఘాల సమావేశంలో మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం వెంటనే తమ న్యాయమైన కోర్కెలను తీర్చాలన్నారు. జీపీఎస్ చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం వెనక్కు తీసుకోవడం ద్వారా తమకు కొంత మేర లాభించిందన్నారు. అదే విధంగా ఓపీఎస్‌ను కూడా అమలులోకి తీసుకురావాలన్నారు. సమావేశంలో ఉద్యోగ సంఘ నాయకులు శివారెడ్డి, కరీముల్లా షాఖాదరి, నాగేశ్వరరావు, పోతురాజు, సుమిత్రా దేవి, హేమలత, రోజా, శేషు కుమారి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులపై కేసు కొట్టివేత

తెనాలి రూరల్: ప్రభుత్వ ఉద్యోగులపై నమోదైన కేసులో దర్యాప్తు సరిగా లేని కారణంగా తెనాలి ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) పవన్‌కుమార్ కేసును కొట్టివేశారు. కేసు దర్యాప్తులో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఎస్‌హెచ్‌వోపై ఆగ్రహం వ్యక్తం చేయడంతోపాటు ఎస్పీకి కూడా ఫిర్యాదు చేశారు. బాపట్ల జిల్లా అమృతలూరు మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, గోవాడ వీఆర్‌వోపై అమృతలూరు పోలీస్‌స్టేషన్‌లో 2016లో కేసు నమోదైంది. రేషన్ డీలర్‌షిప్‌కు సంబంధించిన కేసును కోర్టు ఆదేశాల మేరకు పోలీసులు నమోదు చేశారు. కేసు మంగళవారం విచారణకు వచ్చిన పరిశీలించిన న్యాయమూర్తి దర్యాప్తు సరిగా లేదని గుర్తించారు. దీంతో కేసును కొట్టివేస్తూ ఇదే విషయమై బాపట్ల జిల్లా ఎస్పీకి లేఖ రాయాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ మేరకు న్యాయశాఖ సిబ్బంది తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి



మేడికొండూరు: మండలంలోని పేరేచర్లలో గుర్తుతెలియని వ్యక్తి మంగళవారం మృతి చెందాడు. సుమారు 30 సంవత్సరాల లోపు వయసు కలిగి వ్యక్తి మృత దేహం నరసరావుపేట రోడ్డులోని సేకరణ హార్ట్ హైస్కూల్ సమీపంలో పడి ఉంది. నల్ల గళ్ల చొక్కా, ఎర్ర ప్యాంట్ ధరించి ఉన్నాడు. వివరాలు తెలిసినవారు స్థానిక పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని మేడికొండూరు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మేడికొండూరు పోలీస్ స్టేషన్ సీఐ డి.జైకుమార్ 86888 31380 నంబరుకు సంప్రదించాలని తెలిపారు.

కొనసాగుతున్న ఆక్రమణల తొలగింపు



ఆక్రమణల తొలగింపు పనులను పరిశీలిస్తున్న కమిషనర్ శేషన్న

తెనాలి అర్బన్: పట్టణంలో మురుగు కాల్వల పూడికతీత, ఆక్రమణల తొలగింపు పనులు స్పెషల్ డ్రైవ్ కింద నిర్వహిస్తున్నామని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న పేర్కొన్నారు. బోసు రోడ్డులో మంగళవారం ఆక్రమణల తొలగింపును ఆయన పరిశీలించారు. వ్యాపారులు కొందరు అడ్డుకోవడంతో వారితో మాట్లాడి పనిని కొనసాగించారు. మురుగు కాల్వల మీద ఉన్న బండ్లను, ఫ్లోరింగ్‌ను జేసీబీతో తొలగింపజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజలకు అసౌకర్యం కలుగకుండా పలు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. మురుగు కాల్వలోని పూడికతీత పనులు కొనసాగుతున్నట్లు తెలిపారు. అనంతరం 27వ వార్డులో పర్యటించారు. అక్కడ జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించారు. ఆయన వెంట ఆరోగ్యాధికారిణి డాక్టర్ కె.హెలెన్ నిర్మల, ఏసీపీ సుబ్బారావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఆకురాతి రామచంద్రరావు, లక్ష్మీనారాయణ, పలువురు టౌన్ ప్లానింగ్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

నూతన బస్సులు ప్రారంభం



పట్నంబజారు: ఏపీఎస్ ఆర్టీసీ గుంటూరు డిపో పరిధిలో మంగళవారం నూతనంగా రెండు బస్సులను ప్రారంభించారు. అల్ట్రా డీలక్స్ బస్సుల ప్రారంభానికి గుంటూరు తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే ఎండీ నసీర్ అహ్మద్, జోన్ త్రీ ఈడీ ఆదాం సాహెబ్, గుంటూరు రీజియన్ మేనేజర్ ఎం.రవికాంత్‌తో పాటు ఇతర అధికారులు కలిసి బస్సులను ప్రారంభించారు. ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ మాట్లాడుతూ ప్రయాణికుల సౌకర్యార్థం నూతన బస్సులు ప్రారంభించడం సంతోషకరమన్నారు. భవిష్యత్తులో కూడా రాష్ట్ర ప్రభుత్వం ప్రయాణికుల రద్దీగా అనుగుణంగా బస్సులను ఏర్పాటు చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు శ్రీనివాసరావు, ఎంవీఎస్ రామకృష్ణ, అబ్దుల్ సలాం, సత్యనారాయణ, సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ చౌర్యం.. రూ.10 లక్షల జరిమానా

అధికారుల విస్తృత తనిఖీలు

గుంటూరు ఈస్ట్: విద్యుత్ శాఖలో డీ–6 సెక్షన్ పరిధిలోని ఏటీ అగ్రహారం, కన్నవారితోటలో మంగళవారం అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు కె.సూర్యప్రకాష్, శ్రీనివాసులుబాబు పర్యవేక్షణలో 58 మంది అధికారులు, 120 మంది సిబ్బంది 58 బృందాలుగా ఏర్పడి 4,608 సర్వీసులను తనిఖీలు చేశారు. విద్యుత్తు చౌర్యానికి పాల్పడుతున్న 205 మందికి రూ.10.81 లక్షల జరిమానా విధించారు. అనుమతించిన కేటగిరికి కాక ఇతర కేటగిరీలో విద్యుత్తు వాడుతున్న ఐదుగురికి రూ.70 వేలు అపరాధ రుసుం విధించారు. అనుమతించిన లోడ్ కంటే అదనంగా విద్యుత్ వాడుకున్న 200 మందికి రూ.10.11 లక్షల జరిమానా విధించారు. ఈ తనిఖీల్లో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు ఎం.రవికుమార్, కె.రవికుమార్, బి.రాజమోహన్, ఏఈలు కోటేశ్వరరావు, ఎ.చంద్రశేఖర్, ఎస్.వెంకటేశ్వర్లు ఇతర అధికార సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి బీజేపీ మహిళా మోర్చా పరామర్శ

గుంటూరు మెడికల్: చేబ్రోలుకి చెందిన 8వ తరగతి విద్యార్థిని అనుమానాస్పద మృతిపై బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు నడ్డి నాగమల్లీశ్వరి స్పందించారు. మంగళవారం గుంటూరు జీజీహెచ్‌లో బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, తమ ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. మార్చురి వద్ద ఘటన గురించి ఆరా తీశారు. చిన్నారి మేనత్త మాట్లాడుతూ.. నిందితుడిని త్వరగా పట్టుకొని ఉరితీయాలని, అప్పుడే తమకు న్యాయం జరిగినట్లని విలపిస్తూ చెప్పారు. దీంతో నాగమల్లీశ్వరి వారికి సత్వరం న్యాయం జరిగేలా తమవంతు ప్రయత్నం చేస్తామని చెప్పారు. ఉపాధ్యక్షురాలు సైదా రాణి , కోశాధికారి డాక్టర్ స్రవంతి, కార్యదర్శి మహాలక్ష్మి తదితరులు పరామర్శించారు.

ప్రతి ఒక్కరికి కార్మెల్ మాత దీవెనలు



ఫిరంగిపురం: మండల కేంద్రంలో నిర్వహిస్తున్న కార్మెల్ మాత ఉత్సవాల్లో ఎమ్మెల్యే టి.శ్రావణ్‌కుమార్ మంగళవారం పాల్గొన్నారు. కార్మెల్ కొండ వద్దకు వచ్చి దిగువన ఉన్న కార్మెల్ మాత స్వరూపం వద్ద కొబ్బరి కాయ కొట్టి ప్రార్థనలు చేశారు. ప్రతి కుటుంబానికి కార్మెల్ మాత దీవెనలు ఉండాలని కోరుకున్నారు. పూజల్లో బాల ఏసుదేవాలయ విచారణ గురువులు ఫాతిమా మర్రెడ్డి పాల్గొన్నారు. ఆయన వెంట మండవ నరసింహారావు, స్థానిక నాయకులు ఉన్నారు.

ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్ పాదయాత్ర

తాడికొండ: తుళ్ళూరు మండలం దొండపాడు, బోరుపాలెం, హరిశ్చంద్రాపురం గ్రామాల్లో మంగళవారం ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ కృతజ్ఞత పాదయాత్ర నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికల్లో తనను భారీ మెజార్టీతో గెలిపించినందుకు గ్రామస్తులకు ధన్యవాదాలు తెలిపారు. పార్టీ మండలాధ్యక్షుడు ధనేకుల సుబ్బారావు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దామినేని శ్రీనివాసరావు, గ్రామపార్టీ అధ్యక్షుడు కట్టా నరసింహ, కొమ్మినేని కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.